andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.2 : కనిష్ఠం 24.7
నిర్మల్ జిల్లా వార్తలు
8
శుక్రవారం 19 జూలై 2024



మార్కెట్ కమిటీల ఆదాయ లక్ష్యం ఖరారు



- జిల్లాలో ఐదు వ్యవసాయ మార్కెట్ కమిటీలు
- గతేడాది వార్షిక లక్ష్యం రూ.14.61 కోట్లు
- సమకూరిన ఆదాయం రూ. 15.97 కోట్లు
- ఈ యేడాది వార్షిక లక్ష్యం రూ.13.96 కోట్లు
- మూడు నెలల్లో సమకూరిన ఆదాయం రూ.1.12 కోట్లు

భైంసా, జూలై 18 : మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికార యంత్రాంగం వ్యవసాయ మార్కెట్ కమిటీలకు వార్షిక ఆదాయ లక్ష్యాలను ఖరారు చేశారు. జిల్లాలోని ఐదు వ్యవసాయ మార్కెట్ కమిటీలకు 2024-25 వార్షిక సంవత్సరానికి గాను రూ.13.96 కోట్ల ఆదాయ లక్ష్యాన్ని నిర్ణయించారు. గత వార్షిక సంవత్సరం రూ.14.61 కోట్ల లక్ష్యం ఉండగా ఈ వార్షిక సంవత్సరానికి గాను రూ.65.46 లక్షలను తగ్గించి రూ.13.96 కోట్లుగా ఖరారు చేశారు. మార్కెట్లకు ప్రభుత్వ రంగ సంస్థల నుంచి పాత బకాయిలు జమ కావటం, గోదాముల అద్దెలు, లైసెన్సులు, చెక్‌పోస్టులతో ఆదాయం లభిస్తుండగా వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఆదాయ లక్ష్యాన్ని మార్కెటింగ్ శాఖ అధికారులు తేల్చారు.

దీంతో ఆయా మార్కెట్ కమిటీల అధికార యంత్రాంగం ఆదాయ లక్ష్యాలను సాధించే చర్యల్లో నిమగ్నమయ్యారు.


భైంసా మార్కెట్ యార్డులో జరుగుతున్న లావాదేవీలు

జిల్లాలో ఐదు వ్యవసాయ మార్కెట్ కమిటీలు

జిల్లాలో భైంసా, నిర్మల్, ఖానాపూర్, సారంగపూర్, కుభీర్ కేంద్రాల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నాయి. ఐదు మార్కెట్ కమిటీలకు గాను 2024-25 వార్షిక సంవత్సరానికి గాను మార్కెటింగ్ అధికార యంత్రాంగం రూ.13.96 కోట్ల ఆదాయన్ని లక్ష్యాన్ని ఖరారు చేసింది. ఎన్నికలు, పలు కారణాలతో మార్కెట్ కమిటీల వార్షియ ఆదాయ లక్ష్యాలు నిర్దేశించడం ఆలస్యమైంది. ప్రణాళికబద్ధమైన విధానాల ద్వారా గత వార్షిక సంవత్సరం మాదిరిగానే లక్ష్యాన్ని మించి ఆదాయాన్ని రాబట్టేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. మార్కెట్ కమిటీల వారిగా లక్ష్యాలను పరిశీలిస్తే భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీకి రూ.6.3 కోట్లు, నిర్మల్ మార్కెట్ కమిటీకి రూ.3.56 కోట్లు, ఖానాపూర్ మార్కెట్ కమిటీకి రూ.1.3 కోట్లు, కుభీర్ మార్కెట్ కమిటీకి రూ.65 లక్షలు లక్ష్యంగా నిర్ణయించారు. ఏప్రిల్ నుంచి జూన్ మాసం ముగిసే వరకు జిల్లాలోని ఐదు మార్కెట్ కమిటీలు రూ.1.12 కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకున్నాయి. ఇందులో భైంసా మార్కెట్ కమిటీ రూ.71.83 లక్షలు, నిర్మల్ మార్కెట్ కమిటీ రూ.27.12 లక్షలు, ఖానాపూర్ మార్కెట్ కమిటీ రూ.4.94 లక్షలు, సారంగపూర్ మార్కెట్ కమిటీ రూ.3.10లక్షలు, కుభీర్ మార్కెట్ కమిటీ రూ.5.55 లక్షల ఆదాయాన్ని చేరుకుంది.

గత వార్షిక లక్ష్యాన్ని మించి సమకూరిన ఆదాయం

2023-24 వార్షిక సంవత్సరములో జిల్లాలోని మార్కెట్ కమిటీలు లక్ష్యాన్ని మించి ఆదాయాన్ని అర్జించాయి. జిల్లాలోని ఐదు మార్కెట్ కమిటీలకు గతేడాది వార్షిక లక్ష్యం రూ.14.61 కోట్లు ఉండగా రూ.15.97 కోట్ల ఆదాయం సమకూరింది. గతేడాది లక్ష్యాన్ని మించి రూ.1.36 కోట్లు అదనంగా ఆదాయం సమకూరింది. ఇక మార్కెట్ కమిటీల వారీగా గతేడాది వార్షిక ఆదాయ లక్ష్యసాధన అంశాలను పరిశీలిస్తే జిల్లాలోని ఐదు మార్కెట్ కమిటీలలో ఒక భైంసా మినహా మిగతా నిర్మల్, ఖానాపూర్, సారంగపూర్, కుభీర్ మార్కెట్ కమిటీలు వార్షిక లక్ష్యాన్ని మించి ఆదాయాన్ని అర్జించాయి. 2023-24 వార్షిక సంవత్సరములో భైంసా మార్కెట్ కమిటీ వార్షిక ఆదాయ లక్ష్యం రూ.6.18 కోట్లు ఉండగా రూ.6.13 కోట్ల ఆదాయం సమకూరింది. ఇక నిర్మల్ మార్కెట్ కమిటీ లక్ష్యం రూ.4.61 కోట్లు ఉండగా రూ.5.52 కోట్లు, ఖానాపూర్ మార్కెట్ కమిటీ లక్ష్యం రూ.1.8 కోట్లు ఉండగా రూ.2 కోట్లు, సారంగపూర్ మార్కెట్ కమిటీ లక్ష్యం రూ.1.52 కోట్లు ఉండగా రూ.1.54 కోట్లు, కుభీర్ మార్కెట్ కమిటీ లక్ష్యం రూ.51 లక్షలు ఉండగా రూ.78.72 లక్షల ఆదాయాన్ని ఆర్జించాయి.


కుభీర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

హరిహర క్షేత్రంలో తొలి ఏకాదశి పూజలు


108 కలశాలతో స్వామివారికి పంచామృతాభిషేకం చేస్తున్న దృశ్యం

నిర్మల్ రూరల్, జూలై 18 : నిర్మల్‌లోని హరిహర క్షేత్రం మల్లన్న గుట్టయందు తొలి ఏకాదశిని పురస్కరించుకొని రమా సహిత సత్యనారాయణ స్వామివారి ఆలయంలో 108 కలశాలతో స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. నూత వస్త్రాలు అలంకరించారు. క్షేత్రానికి విచ్చేసిన భక్తుల విష్ణు సహస్రనామ పారాయణంతో ఆలయం మార్మోగింది. తొలి ఏకాదశి పర్వదినం రోజున ఉపవాస దీక్షను తీసుకున్నటువంటి భక్తులందరూ గురువారం ఉదయం 8 గంటలకల్లా క్షేత్రానికి విచ్చేసి భోజనం చేయవచ్చని ఆలయ నిర్వాహకులు తెలిపారు. అందుకు గాను కావలసిన ఏర్పాట్లు ఆలయ ధర్మకర్తలు అల్లోల వినోదమ్మ మురళీధర్‌రెడ్డి దంపతులు, ఆలయ గురుస్వామి మూర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగిందని ఆలయ కోశాధికారి సామల వేణుగోపాల్ రెడ్డి తెలిపారు.

దత్తసాయి ఆలయంలో దక్షిణామూర్తి యాగం


యాగంలో పాల్గొన్న భక్తులు

నిర్మల్ కల్చరల్, జూలై 18 : నిర్మల్‌లోని గండి రామన్న దత్తసాయి ఆలయంలో గురువారం సరస్వతి హయగ్రీవ సహిత దక్షిణామూర్తి యాగాన్ని వైభవంగా నిర్వహించారు. ఆచార్య ఇందుర్తి కళ్యాణ్ ఆధ్వర్యంలో నవగ్రహ పూజ, హోమం ఇత్యాది ప్రత్యేక పూజలు నిర్వహించారు. సింగిల్ ట్రస్ట్ ఛైర్మన్ లక్కడి జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ... బాసరలో కొలువైన సరస్వతి అమ్మవారి కటాక్షం విద్యార్థులపై మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. పిల్లలు బాగా చదివి తమ తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. భక్తులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే పదిలో ఉత్తమ ఫలితాలు సాధించడం సులువే

- జిల్లా విద్యాధికారి రవీందర్ రెడ్డి



ఖానాపూర్, జూలై 18 : పకడ్బందీ ప్రణాళికతో చదివితే పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడం సులువేనని నిర్మల్ జిల్లా విద్యాధికారి రవీందర్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల సెకండరీ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. నిత్యం పాఠశాలకు హాజరుకావాలని అన్ని తరగతులను శ్రద్ధగా వినాలన్నారు. ఆయా సబ్జెక్టుల పట్ల ఎటువంటి సందేహాలు ఉన్న ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సంధ్యారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కడెం ప్రాజెక్టు వరద గేట్ల ట్రయన్ రన్

- 18 గేట్లను పరిశీలించిన సీఈ శ్రీనివాస్ సహా ఇంజనీర్ల బృందం
- ప్రాజెక్టు గేట్లలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షిస్తామని వెల్లడి


కడెం ప్రాజెక్టును పరిశీలిస్తున్న అధికారుల బృందం

ఖానాపూర్, జూలై 18 : ఇటీవల మరమ్మతులు పూర్తి చేసుకున్న కడెం ప్రాజెక్టు వరద గేట్లను గురువారం ట్రయన్‌రన్ నిర్వహించారు. నీటి పారుదల శాఖ సీఈ శ్రీనివాస్, ఈఈ రవీందర్ ఇంజనీర్ల బృందం ఆధ్వర్యంలో ప్రాజెక్టు 18 గేట్ల ట్రయన్‌రన్‌ను పరిశీలించారు. ప్రాజెక్టు 18 గేట్లను ఎత్తడం దించడంలో ఎటువంటి ఇక్కట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు సీఈ శ్రీనివాస్ పేర్కొన్నారు. గేట్ల లిఫ్టింగ్ సమయంలో పవర్ సప్లై సమస్య తలెత్తకుండా జనరేటర్లు, విద్యుత్ లైన్లతో పవర్ సప్లైని సిద్ధం చేశామన్నారు. ప్రతిరోజు 24 గంటల పాటు వరద ప్రవాహాన్ని మానిటరింగ్ చేసేలా అధికారుల బృందం పర్యవేక్షిస్తుందన్నారు. భారీగా వరదనీరు ప్రాజెక్టులోకి వచ్చినా ముందుస్తుగానే అంచనా వేసి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ విఠల్ రాథోడ్, డీఈ భోజదాస్, ప్రాజెక్టు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి : ఎంపీ నగేష్


ఎంపీ నగేష్‌ను సన్మానిస్తున్న నాయకులు

నిర్మల్ కల్చరల్, జూలై 18 : నిర్మల్ నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా తనవంతు కృషి చేస్తానని ఎంపీ నగేష్ అన్నారు. గురువారం మొదటిసారిగా నిర్మల్‌కు వచ్చిన ఆయనను బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్ రెడ్డి, శ్రేణులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ... ఎంపీ ఎన్నికల్లో నిర్మల్ ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించినందుకు ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డితో పాటు నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, ప్రధాన కార్యదర్శులు రాజేశ్వర్‌రెడ్డి, మేడిసెమ్మె రాజు, పట్టణాధ్యక్షుడు సాధం అరవింద్, నాయకులు కే. శ్రావణ్‌రెడ్డి, రాచకొండ సాగర్, ఒడిసెల అర్జున్, అయ్యన్నగారి రాజేందర్, గాదె విలాస్, అల్లం భాస్కర్, కే. శ్రావణ్, తోట సత్యనారాయణ, రచ్చ మల్లేష్, కార్తీక్, పి. ప్రకాష్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

భైంసా బస్సు డిపో మేనేజర్‌గా హరిప్రసాద్


కార్మికులతో మాట్లాడుతున్న డిపో మేనేజర్ హరిప్రసాద్

భైంసా, జూలై 18 : ఇక్కడి బస్సు డిపో మేనేజర్‌గా హరిప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. నిజామాబాద్ జిల్లా బోధన్ బస్సు డిపోలో ఎంఎఫ్‌గా నున్న హరిప్రసాద్ పదోన్నతిపై ఇక్కడి డిపోకు మేనేజర్‌గా బదిలీ అయి వచ్చారు. ఇది వరకు ఇక్కడ మేనేజర్‌గానున్న అమృత పలు అవినీతి ఆరోపణలపై సస్పెన్షన్‌కు గురైంది.అప్పటి నుంచి నిర్మల్ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి ఇక్కడి డిపోకు ఇన్‌చార్జీ మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారు. భైంసా బస్సు డిపో మేనేజర్‌గా నియమితులైన హరి ప్రసాద్‌కు ఇన్‌చార్జీ డిపో మేనేజర్ ప్రతిమరెడ్డి బాధ్యతలను అప్పచెప్పారు.

రైతు రుణమాఫీకి సంబంధించి అధికారులంతా సమన్వయంతో పని చేయాలి

- బ్యాంక్ మేనేజర్లతో సమావేశంలో కలెక్టర్ అభిలాష అభినవ్


సమావేశానికి హాజరైన బ్యాంక్ మేనేజర్లు, అధికారులు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ టౌన్, జూలై 18 : రైతు రుణమాఫీకి సంబంధించిన నిధులు రైతు ఖాతాలలో జమ చేయటంలో ఎటువంటి సమస్యలు లేకుండా బ్యాంక్ మేనేజర్లు వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి పని చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభివన్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ హాల్‌లో జిల్లాలోని వివిధ శాఖల బ్యాంక్ మేనేజర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం దశల వారీగా కుటుంబానికి 2 లక్షల రూపాయల వరకు రుణమాఫీ అమలుకు శ్రీకారం చుట్టిందని, అందులో భాగంగా గురువారం సాయంత్రం 4 గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించబోతున్నారని తెలిపారు. మొదటి దశలో రూ. 1 లక్ష వరకు రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ జరుగుతుందన్నారు. రుణమాఫీకి సంబంధించిన నిధులు రైతు ఖాతాలలో జమ చేయటంలో ఎటువంటి సమస్యలు లేకుండా బ్యాంక్ మేనేజర్లు వ్యవసాయశాఖ అధికారులతో కలిసి పని చేయాలని సూచించారు. జిల్లాలో మొత్తం 30 వేల 106 మంది రైతులకు రూ. 171.76 కోట్లు మొదటి దశ రుణ మాఫీ కింద జమ చేయడం జరుగుతుందని, ఎలాంటి సమస్యలు తలెత్తే ఆస్కారం లేకుండా అధికారులంతా సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రామ్‌గోపాల్‌తో పాటు వివిధ బ్యాంక్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు నమ్మకం కలిగించేలా పోలీసు సేవలందించాలి : ఎస్పీ



నిర్మల్ కల్చరల్, జూలై 18 : జిల్లా ప్రజలకు నమ్మకం కలిగించేలా నాణ్యమైన సేవలందించాలని జిల్లా ఎస్పీ జానకి షర్మిల పోలీసు యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. గురువారం సెట్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలను అధికారులు, పోలీసు కానిస్టేబుళ్లకు తెలియజేశారు. నూతన చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ప్రజలకు మార్గదర్శకం ఉండాల్సిన పోలీసులు అనైతిక చర్యలకు పాల్పడితే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతల నియంత్రణలో కఠినంగా వ్యవహరించాలని, నేర నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెండింగ్ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. రాత్రిపూట పెట్రోలింగ్ వ్యవస్థను నిఘా వ్యవస్థను పటిష్టపరిచి దొంగతనాలు జరుగకుండా చూడాలన్నారు. సర్కిల్ పరిధిలో ప్రత్యేక టీం ఏర్పాటు చేసి నివారించాలని ఆదేశించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు ప్రతీ రోజు నిర్వహించి వాహనాలు తనిఖీ చేయాలన్నారు. బహిరంగ ప్రాంతాల్లో మద్యం సేవించే వారిపై నిఘా పెంచి కేసు నమోదు చేయాలన్నారు. వర్షాల దృష్ట్యా లోతట్టు ప్రాంతాల ప్రజలకు వరద ముప్పుపై అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు సూచికల బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. భూ కబ్జాదారులు చేసి బెదిరించే వారిపై చర్యలు తీసుకోవాలని, రిజిస్ట్రేషన్ల మోసా లపై చట్టప్రకారం వ్యవహరించాలన్నారు. డ్రగ్స్ అక్రమ రవాణా అరికట్టాలన్నారు. సరిహద్దుల నుండి వచ్చే గంజాయి, సరఫరా చేసే కీలక వ్యక్తులను గుర్తించి కేసులు నమోదు చేయాలన్నారు. గుట్కా, ఇసుక అక్రమ రవాణా, పేకాట, గుడుంబా, పీడీఎస్ బియ్యం, తదితర వాటిపై నిఘా పెంచాలని ఆదేశించారు. నేను సైతం కార్యక్రమం ద్వారా సీసీ కెమెరాల పనితీరు పర్యవేక్షించాలని, రోడ్డు ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ప్రతిరోజు వాహనాలు తనిఖీ చేసి కేసు నమోదు చేయాలన్నారు. ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఓటీపీ మోసాలపై పల్లెల్లో అవగాహన కల్పించాలన్నారు.

రైతు రుణమాఫీ లింకులు ఓపెన్ చేయొద్దు : ఎస్పీ

రైతు రుణాల మాఫీ పేరిట వచ్చే లింకులు ఓపెన్ చేయవద్దని ఎస్పీ జానకి షర్మిల కోరారు. సైబర్ నేరగాళ్లు మోసాలు చేస్తున్నందున అప్రమత్తంగా ఉండాలన్నిరు. 1930 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ నేరగాళ్లు ఏదో ఓ బ్యాంకు పేరిట వాట్సాప్ యాప్ ప్రొఫైల్ బ్యాంకు లోగోతో ఏపీకే ఫైల్స్ పంపిస్తున్నారని తెలిపారు. ఇలాంటి వాటిని క్లిక్ చేయవద్దని సూచించారు. సైబర్ నేరానికి గురైతే దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే న్యాయం జరుగుతుందన్నారు.

ఉపాధ్యాయ ఉమ్మడి సర్వీసు నిబంధనల సాధనకు కృషి : ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్‌రెడ్డి


సభ్యత్వాలను అందచేస్తున్న ఎమ్మెల్సీ

భైంసా, జూలై 18 : దీర్ఘకాలికంగా పెండింగ్‌లోనున్న ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీసు నిబంధనల సాధనకు బాధ్యతాయుతతో కృషి చేస్తున్నామని, త్వరలోనే సాధించి తీరుతామని ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్ రెడ్డి పెర్కొన్నారు. గురువారం భైంసా పట్టణంలోని ఆశ్రమ పాఠశాల, కేజీబీవీ పాఠశాలల్లో పీఆర్‌టీయూ టీఎస్ సభ్యత్వ సేకరణ కార్యక్రమాన్ని చేపట్టిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో మాట్లాడారు. ఉమ్మడి సర్వీసు నిబంధనల సాధన ద్వారా అర్హులైన స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించేందుకు గాను మార్గం సుగమం అవుతుందన్నారు. సంబంధిత విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించామని, ఇందుకు సంబంధించిన డ్రాఫ్ట్‌ను సీఎంవో అధికారి మానిక్‌రావ్‌కు అందించడం జరిగిందన్నారు. 2023 సంవత్సరం ఫిబ్రవరి మాసంలో నిలిచిపోయిన ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలను గత నెలలో విజయవంతంగా పూర్తి చేయించామని వివరించారు. పదోన్నతుల ప్రక్రియ ద్వారా మిగిలిపోయిన పోస్టులకు త్వరలోనే షెడ్యూల్ ఇప్పించి భర్తీ చేసేందుకు చిత్తశుద్ధితో చర్యలు తీసుకుంటామని తెలిపారు. బదిలీ వెబ్ అప్షన్లలో జరిగిన పొరపాట్లను పక్షం రోజులలోగా పరిష్కరించడానికి ప్రభుత్వానికి ప్రాతినిధ్యం చేశామని వెల్లడించారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల పాత పెన్షన్ పునరుద్ధరించడానికి కృషి చేస్తున్నట్లుగా వివరించారు. సీపీఎస్ రద్దు కోసం ప్రభుత్వం అన్ని రకాల ఒత్తిడి తీసుకవస్తున్నామని పెర్కొన్నారు. జీవో నెం 317లో స్వంత జిల్లాలను కోల్పోయిన ఉపాధ్యాయులను స్థానికత ఆధారంగా స్వంత జిల్లాలకు బదిలీలు జరిగేలా చర్యలు చేపడుతున్నాని తెలిపారు. ఇందులో యూనియన్ జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు నరేంద్రబాబు, బీవీ రమణరావ్, భైంసా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బల్ల గజ్జారామ్, గోపాల్ యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సీఎం రేవంత్‌రెడ్డిని దూషించిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

దిలావర్‌పూర్, జూలై 18 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని దూషిస్తూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన వ్యక్తిపై గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దిలావర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన తాండ్ర నాగరాజు అనే యువకుడు రైతు రుణమాఫీని ఎవడికిస్తున్నావంటూ సీఎం రేవంత్ రెడ్డిని దుర్భాషలాడినట్లు కాంగ్రెస్ కార్యకర్తలు ఫిర్యాదులో పేర్కొన్నారు. సీఎంను దూషించిన నాగరాజును కఠినంగా శిక్షించాలని వారు కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో మండల కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ రమణ, మండల ప్రధాన కార్యదర్శి నిమ్మ గణేష్, యూత్ ప్రెసిడెంట్ మహేందర్, సీనియర్ నాయకులు కే. రాజారెడ్డి, యూసుఫ్, యువజన నాయకులు కోడె నవీన్, విజయ్, సలీం, అరుణ్, దయాకర్‌లు ఉన్నారు.

కేసు నమోదు

సీఎం రేవంత్‌రెడ్డిని దూషిస్తూ సోషల్ మీడియాలో పోస్టు చేసిన నాగ రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేశ్వర్ గౌడ్ తెలిపారు. సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నాగరాజుపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బీఎన్‌ఎస్ 352, 353 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

బీజేపీ నాయకుడిని పరామర్శించిన ఎంపీ

నిర్మల్ కల్చరల్, జూలై 18 : నిర్మల్ జిల్లా బీజేపీ నాయకుడు వి. సత్యనారాయణ గౌడ్‌ను గురువారం ఎంపీ నగేష్ పరామర్శించారు. ఇటీవల గౌడ్ కాలు ఫ్యాక్చర్ కాగా విషయం తెలుసుకున్న ఎంపీ ఇందిరానగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. నాయకులు ఎంపీ వెంట ఉన్నారు.


నేడు బీజేపీ సమావేశం

నిర్మల్ కల్చరల్, జూలై 18 : జిల్లా బీజేపీ కార్యకర్త సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు పార్టీ క్యాంపు కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిసెమ్మె రాజు ఒక ప్రకటనలో తెలిపారు. శాసన సభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్, జిల్లా అధ్యక్షుడు అంజు కుమార్ రెడ్డి హాజరుకానున్నారని తెలిపారు. కోర్ కమిటీ సభ్యులు, మండల పార్టీ అధ్యక్షులు, పదాధికారులు, మాజీ ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు సమావేశానికి రావాలని కోరారు.

వైన్స్, కల్లుదుకాణాల్లో చోరీ

నర్సాపూర్(జి), జూలై 18 : మండల కేంద్రంలోని నీలిమా వైన్స్ తాళం పగలగొట్టి చేసి డిజిటల్ వీడియో పరికరం ఎత్తుకుపోయారు. బుధవారం రాత్రి కల్లు దుకాణంలో తాళం పగుల గొట్టి సీసీ కెమెరాలు ధ్వంసం చేసి డిజిటల్ వీడియో పరికరాలు ఎత్తుకెళ్లారని ఫిర్యాదు వచ్చిందని పోలీసులు తెలిపారు.





ప్రజాపాలన సేవా కేంద్రం ప్రారంభం

ఆదిలాబాద్ అర్బన్, జూలై 18: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజాపాలన ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలు రాని దరఖాస్తుదారులు ప్రజాపాలన సేవ కేంద్రం ద్వారా డేటా సవరణ (కరెక్షన్) చేసుకోవచ్చని జిల్లా పాలనాధికారి రాజార్షిషా అన్నారు. గురువారం సీపీఓ కార్యాలయంలో ప్రజాపాలన సేవ కేంద్రం ప్రారంభం సందర్భంగా ఆయన మాట్లాడారు. సేవ కేంద్రాలకు వెళ్లి సవరణ చేసుకుని లబ్ధి పొందాలన్నారు.





ఆర్టీసీ బస్సులో మహిళ హంగామా

ఆదిలాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ నుంచి నిర్మల్ జిల్లా కేంద్రానికి వెళ్లే ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులో ఓ మహిళ మద్యం మత్తులో హంగామా సృష్టించింది. గురువారం మధ్యాహ్నం నిర్మల్ వైపు వెళ్లే బస్సులో ప్రయాణిస్తున్న మహిళను కండక్టర్ ఆధార్‌కార్డు చూపాలని కోరగా పూర్తిగా చినిగిపోయిన గుర్తుపట్టలేని ఆధార్‌కార్డును చూపించింది. ఆధార్‌కార్డు నిర్ధారణ కాకపోవడంతో కండక్టర్ టికెట్ తీసుకోవాలని సూచించాడు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన మహిళ బూతుమాటాలతో కండక్టర్, డ్రైవర్లపై దాడికి ప్రయత్నించింది. టికెట్ తీసుకోవాలని లేదంటే బస్సు దిగాలని చెప్పినా వినలేదు. దీంతో ఆదిలాబాద్ టూ టౌన్‌పోలీసుస్టేషన్ ముందు బస్సును నిలిపివేసి ఇతర ప్రయాణికులను దింపివేశారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మద్యం మత్తులో ఉన్న మహిళను పోలీసుస్టేషన్‌కు తరలించారు. మహిళా పోలీసులు రావడం ఆలస్యం కావడంతో దాదాపు గంట తర్వాత ప్రయాణికులతో బస్సు నిర్మల్ వైపు బయలుదేరి వెళ్లింది.

వర్షాకాలంలో పిడుగుల పట్ల జాగ్రత్త అవసరం

భోథ్, జూలై 18 : వర్షాకాలంలో పొలం పనులకు వెళ్లే రైతులు పిడుగుల పట్ల జాగ్రత్త అవసరం అని హక్కుల కమిషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాశెట్టి రాజ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని సోనాల గ్రామ పరిసరాల్లో మహారాష్ట్ర నుంచి వచ్చిన వలస కూలీలకు పిడుగుల విషయంలో అవగాహన కల్పించారు. పిడుగులు పడే సమయంలో చెట్ల కిందికి వెళ్లవద్దని సూచించారు. మొబైల్ ఫోన్లు వాడకూడదని వివరించారు.



కడెంకు రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు తెస్తాం

● రిసార్ట్ సంస్థ చైర్మన్ పైడిపల్లి రవీందర్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న పైడిపల్లి రవీందర్ రావు

నిర్మల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కడెం నారాయణ రెడ్డి ప్రాజెక్టు పరిసరాలను, ఇక్కడి రిసార్ట్‌ను మరింత అభివృద్ధి చేసి పర్యాటక రంగంలో కడెంకు రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తామని లేక్‌వ్యూ రిసార్ట్ సంస్థ చైర్మన్ పైడిపల్లి రవీంధర్‌రావు అన్నారు. రాష్ట్రం నలమూలల నుంచి ఇక్కడి వచ్చే పర్యాటకుల కోసం సకల సదుపాయాలు కల్పించనున్నట్లు బృందావన్ గార్డెన్స్ లేక్ వ్యూ రిసార్ట్ సంస్థ చైర్మన్ పైడిపల్లి రవీంధర్‌రావు తెలిపారు. పిల్లల కోసం ప్లే గ్రౌండ్, వాటర్ స్పోర్ట్స్ తదితర సౌకర్యాలతో పాటు ప్రాజెక్టులో అత్యాధునిక బోటింగ్ సిస్టంను సందర్శకులకు అందుబాటులోకి తేస్తామన్నారు. అలాగే సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం అటవీ శాఖ అధికారుల అనుమతితో సమీపంలోని అటవీ ప్రాంతంలో ట్రెక్కింగ్, జంగిల్ సఫారీ తదితర సౌకర్యాలను కల్పిస్తామన్నారు. ప్రస్తుతం ఇక్కడ ఉన్న కడెం హరిత రిసార్ట్‌ను రాష్ట్ర ప్రభుత్వం గత నెల 24న తమ బృందావన్ గార్డెన్స్ లేక్ వ్యూ రిసార్ట్‌కు అప్పగించినట్లు ఆయన తెలిపారు. గత కొద్ది రోజులుగా కడెంలోని హరిత రిసార్ట్‌ను ప్రైవేటుకు అప్పగించడంపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో బృందావన్ సంస్థ చైర్మన్ రవీందర్ రావు గురువారం నిర్మల్‌లో మీడియాతో మాట్లాడారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతోనే గత నెల 22న టూరిజం ఎండీ కడెం హరిత రిసార్టును తమ సంస్థకు 33 యేళ్ల పాటు లీజుకు ఇచ్చారన్నారు. 11 యేళ్ల క్రితమే ఇక్కడ రిసార్ట్ నిర్మించేందుకు తమ సంస్థ టెండర్ దక్కించుకున్నదని, కొన్ని సాంకేతిక కారణాలతో అది వాయిదా పడుతూ వచ్చిందన్నారు. త్వరలోనే ఇక్కడి రిసార్టును అన్ని హంగులతో తీర్చిదిద్ది పర్యాటకులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.


రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

● కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి

జైనథ్, జూలై 18 : తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం రైతు రుణమాఫీ చేయడం పై మండల కేంద్రమైన జైనథ్ బస్టాండ్ ఆవరణలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం స్థానిక జైనథ్ రైతువేదిక భవనంలో నిర్వహించిన సీఎం కాన్ఫరెన్స్‌లో అధికారులు నాయకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జైనథ్ గ్రామంలో టపాసుల మధ్య పలు వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. రూ.లక్ష రుణమాఫీ బ్యాంక్ అకౌంట్‌లో డబ్బులు వేయడం పట్ల అధికారులు, నాయకులు, రైతులు టపాసులుపేల్చి సంబరాలను జరుపు కున్నారు. కార్యక్రమంలో ఏవో వివేక్‌కుమార్, నాయకులు రుకేష్‌రెడ్డి, అశోక్ రెడ్డి, మాసం నర్సింగ్‌రావ్, జగదీష్‌రెడ్డి, పిడుగు స్వామిమాదవ్‌లతో పాటు జైనథ్ గ్రామ రైతులు పాల్గొన్నారు.











భజాభజంత్రీలతో పీరులను ఊరేగింపునిర్వహిస్తున్న భక్తులు

జోరు వానలో తగ్గని హసన్ హుస్సేన్‌ల హోరు

● జనసంద్రంగా మారిన రుయ్యాడి
● విచిత్ర వేషధారణలో భక్తులను ఆకట్టుకున్న గ్రామస్తులు

తలమడుగు, జూలై 18: మత సామరస్యానికి అతీతంగా జరుపుకునే మొహర్రం వేడుకలను తలమడుగు మండలంలో వారం రోజులుగా ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం మొహర్రంపండుగను పురస్కరించుకుని రయ్యాడి గ్రామంలో గల పీరీలకు ఘనమైన చరిత్ర ఉండటంతో పీరీలను తిలకించేందుకు జిల్లానలుమూలల నుంచి కాకుండా కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టామని, హసన్ హుస్సేన్ ఆలయ కమిటీ అధ్యక్షుడు లోక భూమారెడ్డి తెలిపారు. భక్తుల కోసం భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమానికి గ్రామస్తులు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటుచేశారు. భక్తులను ఆకట్టుకునేందుకు గ్రామస్తులు విచిత్ర వేషధారణతో ఎంతగానో ఆకట్టుకున్నారు. తహసీల్దార్ రాజమోహన్ పీరులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో ఆలయ కమిటీ అధ్యక్షులు లోక భూమారెడ్డి, మాజీ జడ్పీటీసీ గణేష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పోతారెడ్డి, సీఈవో మోతె శ్రీనివాస్, వెంకటరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, నరసింహులు, సాంబశివ, జీవ న్‌రెడ్డి, ఓయూ జేఏసీ అధ్యక్షుడు దత్తాత్రేయ, 4వ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగాధర్, గణపతిరెడ్డి, గంగాధర్, గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. అలాగే తలమడుగు, సుంకిడి, బరంపూర్, జరి, దేవాపూర్, కజ్జర్ల, డోర్లీ గ్రామాల్లో మొహరం పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు.



భక్తులతో కిటకిటలాడిన రుయ్యాడి

ఉద్యోగుల బదిలీల పర్వం

ఆదిలాబాద్ అర్బన్, జూలై 18: సాధారణ బదిలీల్లో భాగంగా ఆదిలాబాద్ పలువురు అధికారులు స్థానచలనం పొందుతున్నారు. ఇందులో భాగంగా గురువారం జడ్పీ సమావేశ మందిరంలో ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్తా ఆధ్వర్యంలో ఉద్యోగులకు బదిలీ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇందులో మండల పంచాయతీ అధికారులు (ఎంపీఓ)లు 7, పంచాయతీ సెక్రటరీ గ్రేడ్ -1 ఒకరు, గ్రేడ్ -2 ఇద్దరు, గ్రేడ్ -3 29, గ్రేడ్ -4 128 ఉద్యోగులకు డీపీఓ శ్రీలత, డీఎల్‌పీఓల ఫణిందర్‌లు బదిలీ కౌన్సిలింగ్ నిర్వహించి పోస్టింగ్ కల్పించారు. శుక్రవారం బదిలీ ఉత్తర్వులు జారీ కానున్నాయి. అటు రెవెన్యూ ఉద్యోగులైన నాయబ్‌తహసీల్దార్ 18, సీనియర్ అసిస్టెంట్లు 26, జూనియర్ అసిస్టెంట్లు 15, ఆఫీస్ సబార్డినెట్లు 18లకు జిల్లా అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ శ్యామలదేవి తన చాంబర్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. వీరందరికి వారు ఎంచుకున్న ఆప్షనల్ ఆధారంగా పోస్టింగ్‌లు ఇచ్చారు. వీరికి శుక్రవారం బదిలీ ఉత్తర్వులు జారీ చేయనున్నారు. ఇందులో కలెక్టరేట్ ఏఓ పాల్గొన్నారు.

ఆసుపత్రిని తనిఖీ చేసిన ఎమ్మెల్యే

ఉట్నూర్, జూలై18: ఉట్నూర్ మండల కేంద్రంలోని జిల్లాకేంద్ర ఆసుపత్రిని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ గురువారం రాత్రి ఆకస్మీకంగా తనిఖీచేశారు. ఆర్ఎంఓ డాక్టర్ మహేంద్రతో కలిసి వార్డులను పరిశీలించారు.



ఉట్నూర్‌లో ఎడ్లబండ్ల ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్



మావల రైతు వేదికలో సీఎంకు పాలాభిషేకం చేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

హోరెత్తిన రుణమాఫీ సంబరాలు

● ఎడ్లబండి ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే ● సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన రైతులు, నాయకులు

ఉట్నూర్, జూలై18: వరంగల్ డిక్లరేషన్‌లో భాగంగా ఏఐసీసీ అధినేత రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీమేరకు తెలంగాణ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు లక్ష పంట రుణాలు మాఫీ చేస్తూ నిధులు విడుదల చేస్తుండడంతో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, రైతులు, నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన రుణమాఫీ సంబరాలు హోరెత్తాయి. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ ఆధ్వర్యంలో గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి రైతులతో కలిసి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి రైతుల ఎడ్లబండి ర్యాలీని ప్రారంభించారు. ఎడ్లబండి ర్యాలీ ద్వారా ఉట్నూర్ పట్టణంలోని పాతబస్టాండ్ వరకు పాల్గొని విలేకరులతో మాట్లాడారు. దేశంలోనే చారిత్రక నిర్ణయం సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని దేశంలో ఎక్కడా లేనివిధంగా సీఎం, డిప్యూటీ సీఎం, వ్యవసాయ మంత్రి, మంత్రివర్గం కలిసి రూ. 2లక్షల రైతురుణమాఫీ అమలులోకి తెచ్చారన్నారు. రాహుల్‌గాంధీ హామీమేరకు సీఎం రైతు రుణమాఫీ ప్రకటించారన్నారు. రాష్ట్రంలో 24లక్షల 31వేల మంది రైతులకు 68 కోట్లతో రుణమాఫీ అందుబాటులోకి వచ్చిందని అన్నారు. ఖానాపూర్‌లో 11,940 మంది రైతుల కుటుంబాలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకురాలు ఆత్రంసుగుణ, మండల పార్టీ అధ్యక్షుడు అబ్దుల్ ఖయ్యుం, మహమ్మద్‌ఇక్బాల్, లాజర్, నిసర్, ఆత్రంరాహుల్, అబ్దుల్‌కైసర్, పెందూరుకళావతి, అన్నపూర్ణ, నీలాబాయి, కౌసల్య, తదితరులు ఉన్నారు.

బజార్‌హత్నూర్‌లో సంబరాలు

బజార్‌హత్నూర్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రైతన్నకు ఇచ్చిన మాటకు కట్టుబడి రెండు లక్షలరూపాయల వరకు ఉన్న ఋణాన్ని ఏకకాలంలో మాఫి చేస్తున్న సందర్భంగా మండలం పరిదిలోని రైతు వేదికల్లో నాయకులు రైతులతో కలిసి పెద్ద మొత్తంలో సంభురాలు జరుపుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి రైతును ఋణ విముక్తి చేసినందుకు రైతులందరు కలిసి పాలాబిశేకం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జల్కె పాండురంగ్, మాజి జడ్పిటిసి మల్లెపూల నర్సయ్య, ఇర్ల శివుడు, కిషన్, శ్రీనివాస్, పాండు, విఠల్, సందీప్, అధికారులు ఉన్నారు.

రుణమాఫీ చారిత్రాత్మక నిర్ణయం

మావల: ఒకే విడతలో రుణమాఫీ చేయడం దేశంలోనే ఒక చారిత్రాత్మక నిర్ణయమని, ఆగస్టు 15లోగా 2లక్షల రుణమాఫీ జరుగుతుందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినట్టే చేసి చూపారని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వం రైతులందరికీ రుణమాఫీ ప్రకటించిన సందర్భంగా మావల రైతు వేదిక వద్ద మండల వ్యవసాయ అధికారులు, వాఘాపూర్, బట్టి సావర్గావ్, మావల రైతులు, కాంగ్రెస్ శ్రేణులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మంత్రి సీతక్క చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. అంతకు ముందు మావల నుంచి ర్యాలీగా వచ్చి బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మావల మండల అధ్యక్షులు చంద్ర శేఖర్, సీనియర్ నాయకులు నలిమెల నవీన్‌రెడ్డి, కుంబోజి రాములు, అల్లూరి శేఖర్‌రెడ్డి, రెండ్ల రాజన్న, దొగ్గలి గంగయ్య, దొడ్డ నారాయణ, గాలిపెల్లి నాగన్న, ఎదుల స్వామి, అన్నం సంటేనా నాగ్ రాజు, రంజిత్‌రెడ్డి, ఎంబటి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, నాయకులు

దశాబ్దాల కల నేరవేరింది

ఉట్నూర్: అఖిల భారత కాంగ్రెస్ కమిటీ నాయకురాలు సోనియాగాంధీ తోనే తెలంగాణ రాష్ట్రం సాధించుకోవడంతో తెలంగాణ ప్రజల కల నేరవేరిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. బుధవారం ఉట్నూర్ మండలంలోని షాంపూర్ రైతు వేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సీఎం మాట్లాడుతూ పదేళ్ల పాటు అధికారంలో ఉన్న గత ప్రభుత్వం రైతులకు ఇచ్చిన రుణాల మాఫీ హామీని విస్మరించిందని అన్నారు. వరంగల్ డిక్లరేషన్‌తోపాటు తుక్కుగూడలో సోనియా గాంధీ ఇచ్చిన హామీ రెండు లక్షల రుణమాఫీ ఈ రోజు నుంచి ఆగస్టు వరకు రెండు లక్షలు రుణం మాఫీ చేస్తామన్నారు. 8నెలల్లోనే తెలంగాణ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీని అమలు చేస్తున్నామన్నారు. మొదటి విడతలో 698వేల కోట్లు రైతులకు రుణవిముక్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో ఛైర్మన్ ఎస్పీ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ దావులే బాలాజీ, జిల్లా కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏక్‌బాల్, లింగంపల్లి చంద్రయ్య, ఖయ్యుం, మాజీ సర్పంచ్‌లు జాదవ్ జగదీశ్, జాదవ్‌సునిల్ నాయక్, సహకార సంఘం సీఈఓ మల్లయ్య, వ్యవసాయ విస్తరణ అధికారులు జడ దేవేందర్, కుడుమిత సుధాకర్, సాయికుమార్, రవీందర్, రంజిత్, కుమ్రజయశ్రీ, మహేశ్, వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

తలమడుగు: మండలంలోని బరంపురం గ్రామంలో రైతులు, అధికారులు ఎద్దుల బండ్లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, మండల కన్వీనర్ కళ్యాణం రాజేశ్వర్, సహకార సంఘం ఛైర్మన్లు దామోదర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు. అలాగే సీఎం గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మండలంలోని బరంపూర్ గ్రామంలో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

అన్నా బాహుసాటేకు ఘన నివాళి

ఉట్నూర్, జూలై 18: భారతీయ సాహిత్య సామ్రాట్‌లోక్ శాహిర్ అన్నా బాహుసాటేకు ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ నివాళులర్పించారు. ఉట్నూర్ మండలకేంద్రంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఆయన చదువు తక్కువ ఉన్నా దాదాపు 32 నవలను రచించారని, అందులో కాదంబరి నవల చాలాముఖ్యమైనదని అన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా దళిత బడుగుబలహీన వర్గాలకోసం తన రచనలతో చైతన్య పరిచారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఆదిలాబాద్ జిల్లా నాయకురాలు ఆత్రంసుగుణ, ఉట్నూర్ మండల అన్నాబాహుసాటే అధ్యక్షుడు రాజపేంకే రాజకుమార్, గాదెకర్‌సంజీవ్, కన్వీనర్ బిరుదుల లాజర్, అందారేబాబు, కామ్లె మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

గుడిహత్నూర్: దేశంలో అణగారిన ప్రజల కోసం అన్నాబావు సాఠే చేసిన సేవలు మరువలేనివని బీజేపీ జిల్లా అధ్యక్షులు పతంగే బ్రహ్మానంద్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం అన్నాబావు సాఠే వర్ధంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అన్నాబావు సాఠే సంఘం అధ్యక్షుడు బాలాజీ, ఉపాధ్యక్షుడు వాగ్మరే అంకుష్, మాంగ్ సమాజ్ రాష్ట్ర కోశాధికారి గాయ్ కాంబ్లే కూశాల్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: లోక్‌షాహీర్, సాహిత్య సామ్రాట్ అన్నాబావు సాఠే ప్రపంచంలోనే గొప్ప సాహితీ వేత్త అని అన్నాబావు సాఠే మెమోరియల్ అసోసియేషన్ మండల ప్రధాన కార్యదర్శి అందారే బాలాజీ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక మార్కెట్ యార్డులో ఎదురుగా అన్నాబావు సాఠే వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన రచించిన రచనలు దేశ విదేశాల్లో మంచి ప్రజాదరణ పొందాయని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల వారి కోసం ఎంతగానో కృషి చేశారని, కుల వివక్ష నిర్మూలన కోసం నిరంతరం పోరాడిన మహా యోధుడని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రాందాస్, నాయకులు మోతేవార్ సంబాజీ, కాంబ్లే జనార్ధన్, సీతారాం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'పట్టా పాస్‌బుక్ ఆధారంగా రుణమాఫీ చేయాలి'

ఆదిలాబాద్ అర్బన్, జూలై18: రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా పట్టా పాస్‌బుక్ ఆధారంగా అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్ డిమాండ్ చేశారు. గురువారం పార్టీ జిల్లాకమిటీ సమావేశాన్ని స్థానిక సుందరయ్య భవనంలో బండిదత్తాత్రి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోడుసాగుదారులకు హక్కుపత్రాల ఆధారంగా రుణమాఫీ వర్తింపచేయాలన్నారు. కార్యక్రమంలోం పార్టీ జిల్లాకార్యదర్శి దర్శనాల మల్లేష్, పార్టీ జిల్లా కార్య దర్శివర్గ సభ్యులు లంక రాఘవులు, అన్నమొల్ల కిరణ్, పూసంసచిన్, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జఆశన్న,ఆర్.మంజుల ఉన్నారు.

గ్రామానికి రోడ్డు వేసుకున్న ఆదివాసీలు

బోథ్, జూలై18: మండలంలోని గురుదేవ్‌నగర్ గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు అంతా బురదమయంగా మారింది. గ్రామం నుంచి బయటకు వెళ్లాలంటే గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దీంతో గురువారం గ్రామస్తులంతా చేయి కలిపి తమ గ్రామానికి రోడ్డు వేసుకున్నారు ఎవరో వచ్చి రోడ్డు వేస్తారని ఎదురు చూడకుండా ఆ గిరిజన గూడెం ఆదివాసీలంతా కలిసి సమావేశమై గురువారం ఉదయం పూట గుంతలు పూడ్చుకుని రోడ్డు వేసుకున్నారు. దీంతో కొంత మేరకైనా తమ ఊరి సమస్య తీరుతుందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా మాట ఇచ్చిన నాయకులు మాట తప్పకుండా రోడ్డు వేసి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



రోడ్డు వేసుకుంటున్న గురుదేవ్ నగర్‌వాసులు



ఎమ్మెల్యే రాంరావు పటేల్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆశవర్కర్లు

మొక్కలు నాటి భావితరాలకు బాసటగా నిలవండి

● ముథోల్ ఎమ్మెల్యే రాంరావు పటేల్

భైంసా, జూలై 18 ; ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి భావితరాలకు బాసటగా నిలవాలని ఎమ్మెల్యే రాంరావు పటేల్ అన్నారు. గురువారం భైంసా పట్టణంలోని గోశాలలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు ఏక్ పెడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా తన తల్లి రాధాబాయి పేరిట మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామరావ్ పాటిల్ మాట్లాడుతూ వాతావరణం కలుషితం కాకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ ప్రతి ఇంటా మొక్కలను నాటాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోపాల్ సార్డ, జిల్లా ఉపాధ్యక్షులు తాలోడ్ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు మల్లేశ్వర్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

● ఆశావర్కర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా..

ఆశావర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పాటిల్ పేర్కొన్నారు. గురువారం భైంసాలో ఎమ్మెల్యే పాటిల్‌కు డివిజన్ పరిధిలోని ఆశావర్కర్లు భారీ ర్యాలీగా తరలివచ్చి తాము ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఆశావర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆక్రమణదారులు డబుల్ బెడ్ రూమ్‌లను ఖాళీ చేయాలి : ఆర్డీవో

భైంసా, జూలై 18 : డబుల్ బెడ్ రూమ్ గదులను ఆక్రమించుకున్నవారు వెంటనే ఖాళీ చేయాలని భైంసా ఆర్‌డీవో కోమల్‌రెడ్డి ఆదేశించారు. గురువారం భైంసా డబుల్ బెడ్ రూమ్ గృహ సముదాయంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. పలువురు అక్రమంగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఆక్రమించుకున్నట్లుగా గుర్తించిన ఆర్‌డీవో తక్షణమే వాటిని ఖాళీ చేయాలని ఆదేశించారు. లేని పక్షంలో ఆక్రమణదారుల పై చట్టపరమైన చర్యలు తీసుకోబడుతాయని వెల్లడించారు. లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించేంత వరకు వాటిల్లో ఎవరు ఉండకూడదని.. ఆక్రమించుకోరాదన్నారు. ఈ సందర్భంగా పలువురు డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు ఆర్‌డీవో, తహసీల్దార్‌ను కలిసి ఇళ్లను కేటాయించే విషయమై మాట్లాడారు. సంవత్సరం క్రితం లక్కీ డ్రాలో లబ్ధిదారులుగా ఎంపికైన తమకు ఇప్పటి వరకు గదులు కేటాయించక పోవడం పట్ల వారందరూ అసంతృప్తి వ్యక్తం చేశారు. జాప్యానికి అస్కారం లేకుండా తమకు ఇళ్లను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించి ఆర్‌డీవో కోమల్‌రెడ్డి మాట్లాడుతూ వసతులు, సౌకర్యాలు కల్పించిన తదుపరి ఇళ్లను కేటాయిస్తామని వివరించారు. ఇళ్ల కేటాయింపు విషయంలో లబ్ధిదారులు ఎలాంటి అపోహలకు గురి కావద్దని సూచించారు.

'విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రతలు తీసుకోండి'

నిర్మల్ కల్చరల్, జూలై 18 : నిర్మల్ సర్కిల్ పరిధిలో విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ ప్రమాదాల పట్ల అవగాహన కల్పిస్తున్నట్లు ఎస్ఈ శ్రీనివాస్ తెలిపారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో గ్రామీణ వినియోగదారులు తమ పరిధిలోని క్షేత్రస్థాయి విద్యుత్ సిబ్బందిని లైన్‌మెన్, లైన్ ఇన్స్‌పెక్టర్, సీనియర్ లైన్ ఇన్స్‌పెక్టర్, సంబ్ ఇంజినీర్, సెక్షన్ ఆఫీసర్లను సంప్రదించి తగు సూచనలు పొందాలని కోరారు. సంబంధిత అధికారుల ఫోన్ నెంబర్లు విద్యుత్ బిల్లుపై ముద్రించి ఉంటుందన్నారు. వర్షాకాలంలో ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల వద్దకు వెళ్లకుండా జాగ్రత్త వహించాలన్నారు. హార్వెస్టర్లు విద్యుత్ తీగలు తగలకుండా చూసుకోవాలన్నారు. పంట రక్షణకు విద్యుత్ ఫెన్సింగ్ వేయడం వల్ల.. చేపల వేటకు విద్యుత్ తీగలు అమరిస్తే ప్రమాదాలు సంభవిస్తాయన్నారు. ఇది చట్ట విరుద్ధమని తెలిపారు.

నిర్మల్ జిల్లాలో రుణమాఫీ సంబరాలు

● రుణమాఫీకి రేషన్ కార్డు ప్రామాణికం కాదని దృశ్య, శ్రవణ మాధ్యమం ద్వారా స్పష్టం చేసిన సీఎం



భైంసాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం

భైంసా, జూలై 18: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల రుణమాఫీలో భాగంగా గురువారం లక్షమాఫీకి చర్యలు చేపట్టిన సందర్భాన్ని పురస్కరించుకొని భైంసాలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, రైతుల చేపట్టిన సంబరాలు హోరెత్తాయి. ఉదయం వేళలో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి వర్గీయులు ఆర్‌డీవో కార్యాలయ మార్గంలోని పార్టీ కార్యాలయంలో, మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ బోస్లే నారాయణరావ్‌పాటిల్ వర్గీయులు బస్టాండ్ ఎదుట రుణమాఫీ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని పట్టణ పరిధిలో రెండు వర్గాలకు చెందిన కాంగ్రెస్ శ్రేణులు ర్యాలీలు చేపట్టాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించాయి. రైతులకు మిఠాయిలు పంచిపెట్టాయి. కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వానికి అనుకూలంగా పెద్దపెట్టున నినాదాలు చేశాయి. పార్టీ జెండాలను చేతబట్టి ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేర్వేరుగా నిర్వహించిన సమావేశాల్లో రెండు వర్గాలకు చెందిన కాంగ్రెస్ ప్రతినిధులు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం గత పది సంవత్సరాల కాల వ్యవధిలో రైతు సంక్షేమాన్ని హామీలకు పరిమితం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల రుణమాఫీ ప్రక్రియకు శ్రీకారం చుట్టిందన్నారు. మూడు విడుతల్లో చేపట్టే రుణమాఫీలో మొదటి విడుతగా రూ.1 లక్ష రుణమాఫీ చేపట్టడం జరిగిందన్నారు. ఎన్నికల హామీలన్నింటిని ప్రాధాన్యతననుసారం దశలవారీగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ సర్కార్ చేపడుతోందని వెల్లడించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

నిర్మల్ కల్చరల్, జూలై 18 : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గురువారం రైతుల ఖాతాలో రుణమాఫీ జమచేస్తున్న సందర్భంగా నిర్మల్ మండలం ముజ్గి గ్రామంలో శ్రేణులు సంబరాలు నిర్వహించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రెండు లక్షల రుణమాఫీ హామీని తొలుత లక్ష రూపాయలు జమ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ నెలాఖరు వరకు లక్షన్నర, ఆగస్టులో రెండు లక్షల రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు ఇంత సాహసం చేయడం దేశంలో గొప్ప నిర్ణయమన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు గంగాధర్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు పొలాస మల్లేష్, మాజీ ఎంపీటీసీ సంతోష్, నాయకులు బద్దం లింగారెడ్డి, మహేందర్, నగేష్, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ వర్తింపజేసి రైతు ఖాతాల్లో జమ చేసిన సందర్భంగా గురువారం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు ఆర్డీవో కార్యాలయం ఎదుట క్షీరాభిషేకం చేసి శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. మిఠాయిలు తినిపించుకున్నారు. మున్సిపల్ ఛైర్మన్ ఈశ్వర్, పట్టణాధ్యక్షుడు నాందేడపు చిన్ను, రాష్ట్ర మైనారిటీ నాయకుడు అజహర్ హుస్సేన్, నాయకుడు జునైద్ మెమన్, కౌన్సిలర్ ఇమ్రానుల్లా, నల్లూరి పోశెట్టి, ఎంఏ మతిన్, అయ్యన్నగారి పోశెట్టి, చిలుక రమణ, తదితర నాయకులు పాల్గొన్నారు.



మిఠాయిలు పంచుకుంటున్న కాంగ్రెస్ శేణులు

రైతు రుణమాఫీపై ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుంది

ఖానాపూర్, జూలై 18 : రైతు రుణమాఫీపై ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని ప్రభుత్వం ఏర్పడిన వెంటనే నిలబెట్టుకుందని ఖానాపూర్ మున్సిపల్ ఛైర్మన్ సత్యం అన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతు రుణమాఫీని గురువారం నుండి ప్రారంభించిన నేపథ్యంలో ఖానాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఖానాపూర్‌లో కాంగ్రెస్ శ్రేణులు ఎడ్లబండ్ల ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక తెలంగాణ చౌక్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ కావలి సంతోష్, మండల అధ్యక్షులు దొనికెని దయానంద్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షులు తోట సత్యం, మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్ పాషా, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కదార్ల గంగనర్సయ్య, జిల్లా నాయకులు జన్నారపు శంకర్, నేరళ్ల సత్యనారాయణ, లక్ష్మీపతి గౌడ్, పోలంపల్లి సచిన్, పరిమి సురేష్, మ్యాదరి రాజేశ్వర్, పట్టణ మండల నాయకులు, కార్యకర్తలు, తదితరులున్నారు.



సీఎం ప్రసంగాన్ని వింటున్న అధికారులు, రైతులు, నాయకులు

దిలావర్‌పూర్ : రైతు రుణమాఫీకి రేషన్ కార్డు ప్రామాణికం కాదని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. గురువారం మండలంఓలని బన్సపల్లి రైతు వేదికలో రుణమాఫీ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. పట్టాదారు పాస్ బుక్ ప్రామాణికంగా తీసుకుని రైతులకు రుణమాఫీ చేస్తున్నట్లు చెప్పారు. కొంతమంది కావాలనే అపోహలు సృష్టిస్తున్నారని వాటిని నమ్మొద్దని రైతులను కోరారు. రైతులు స్వీట్లు పంచారు. ఈ సంబరాల్లో మండల రైతులు, పీఏసీఎస్ ఛైర్మన్ వీవీ రమణారెడ్డి, ఎంఏవో స్రవంతి, ఏఈవోలు లక్ష్మీ, శ్రీదేవి, శ్రీవాణి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుండంపల్లి గ్రామంలో..

రైతులకు ఏకకాలంలో రూ. రెండు లక్షల రుణమాఫీ చేసిన సీఎం రేవంత్‌రెడ్డి రైతు బాంధవుడయ్యాడని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాగర్ రెడ్డి, సీనియర్ నాయకుడు కే. దేవేందర్ రెడ్డిలు అన్నారు. ఈ సందర్భంగా గురువారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు క్షీరాభిషేకం చేశారు. రైతుల కళ్లల్లో ఆనందం చూడాలన్న ఉద్దేశ్యంతోనే రైతులకు రుణమాఫీ చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుందనేందుకు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం లాంటివే నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ రమణ, సీనియర్ నాయకులు కట్కం రాజారెడ్డి, కోడె రాజేశ్వర్, ధని రవి, యూత్ ప్రెసిడెంట్ మహేందర్, మైనార్టీ నాయకులు యూసుఫ్, సలీం, అరుణ్, నిమ్మ గణేష్, కోడె నవీన్, సప్పల రవి, గంగారెడ్డి, భోజారెడ్డి, రైతులు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



ఖానాపూర్‌లో ఎడ్లబండితో ర్యాలీ..

సారంగాపూర్ : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సీఎం రేవంత్‌రెడ్డి సార్వత్రిక ఎన్నికల్లో రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తానని హామీ ఇవ్వడంతో హామీని నెరవేర్చారని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను తూచా తప్పకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని పేర్కొన్నారు. ఈ క్షీరాభిషేకం కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దశరథ్ రాజేశ్వర్, నాయకులు బి. నర్సయ్య, విలాస్‌రావు, ఆదిలతో పాటు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నర్సాపూర్(జి) : ఎన్నికల హామిలో ఇచ్చిన విధంగా అర్హులైన రైతులకు మొదటి విడత కింద ప్రభుత్వం లక్ష రూపాయల రుణమాఫీ చేయ డాన్ని స్వాగతిస్తూ నూతన మండలంలోని రైతువేదిక భవనంలో రైతులు సంబరాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అయినందునే ఏకకాలంలో రైతులకు రుణమాఫీ చేస్తున్నదనే విషయాన్ని గుర్తు చేశారు. రుణమాఫీ పథకంతో రైతుల జీవితాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ శాఖా అధికారులు, కాంగ్రెస్ నాయకులు , రైతులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద : మండల కేంద్రంలోని రైతు వేదికలో డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు ఆధ్వర్యంలో గురువారం రుణమాఫీ సంబురం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా రుణమాఫీ చేస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. అందులో భాగంగా మొదటి విడత క్రింద రూ. 1 లక్ష లోపు రుణాలను సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతుల ఖాతాలలో జమ చేసే కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని రైతు వేదికలో ఏర్పాటు చేసిన వీడియో సౌకర్యం ద్వారా ప్రత్యక్షంగా వీక్షించిన అనంతరం రైతులతో కలిసి పై సంబురం నిర్వహించారు. కేక్ కట్ చేసి ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీహరి రావుతో పాటు జడ్పీటీసీ ఓస రాజేశ్వర్, ఏవో ప్రవీణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓడ్నాల రాజేశ్వర్, నాయకులు అబ్బడి ప్రతాప్ రెడ్డి, ఈటెల శ్రీనివాస్, కొండ్ర నరేష్ రెడ్డి, గురాల లింగారెడ్డి, చింతకింది శేఖర్ రెడ్డి, కమల్‌కోట రాజారెడ్డి, తదితరులు ఉన్నారు.



ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.3 । కనిష్ఠం 24.7



ఆదిలాబాద్
జిల్లా వార్తలు

5

శుక్రవారం 19 జూలై 2024

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలి

బజార్‌హత్నూర్, జూలై18: ఆన్‌లైన్ మోసగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని, సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి అమాయక రైతులు, యువకులు, వ్యాపారస్తులు, విద్యార్థులు మోసపోతున్నారని షీటీం సభ్యులు సుశీల అన్నారు. గురువారం మండలకేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో షీటీం ఆధ్వర్యంలో విద్యార్థినులకు సైబర్‌క్రైంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫోన్‌ను అవసరం మేరకు వాడాలని, అనవసరమైన యాప్‌లను, లింకులను ఓపెన్ చేయవద్దని వారికి సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా చేతులెత్తి మద్దతునిస్తున్న కౌన్సిలర్లు



మున్సిపల్ సమావేశానికి వస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్



తీర్మానానికి చేతులెత్తి మద్దతు ఇస్తున్న కౌన్సిలర్లు



- మున్సిపల్ వైస్‌చైర్మన్ జహీర్‌రంజానిపై నెగ్గిన అవిశ్వాసం
- సమావేశానికి 49 మంది కౌన్సిలర్లలో 15 మంది గైర్హాజరు
- కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఒక్కటైన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు
- సభ్యత్వం నమోదు చేసుకున్నా ఓటేయని వెళ్లిపోయిన ఎమ్మెల్యే
- ఐదుగురు కౌన్సిలర్లపై కాంగ్రెస్‌సస్పెన్షన్ వేటు
- కొత్త వైస్‌చైర్మన్ ఎన్నికపై బీజేపీ, బీఆర్ఎస్ నేతల పోటాపోటీ
- గట్టిబందోబస్తు మధ్య ప్రశాంతంగా ముగిసిన అవిశ్వాస ఘట్టం

నెగ్గిన పంతం!

ఆదిలాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ మున్సిపల్ వైస్‌చైర్మన్ జహీర్‌రంజానిపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టిన ప్రతిపక్షాలు చివరకు తమ పంతాన్ని నెగ్గించుకున్నాయి. గురువారం ఉదయం 11గంటలకు మున్సిపల్ కార్యాలయంలో ఆదిలాబాద్ ఆర్డీవో వినోద్‌కుమార్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీలో మొత్తం 49 మంది కౌన్సిలర్లు ఉండగా ఈ సమావేశానికి 34 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. వైస్‌చైర్మన్‌పై బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. దీంతో వైస్‌చైర్మన్‌ను పదవి నుంచి తొలగిస్తూ ఆయనపై అవిశ్వాసం నెగ్గినట్లు ఆర్డీవో ప్రకటించారు. అవిశ్వాసానికి అనుకూలంగా 34మంది కౌన్సిలర్లు మద్దతు తెలిపారు. మరో 15మంది సమావేశానికి హాజరుకాలేదు. బీఆర్ఎస్‌కు చెందిన 25మంది కౌన్సిలర్లు, బీజేపీకి చెందిన 9మంది కౌన్సిలర్లతో పాటు ఎమ్మెల్యే పాయలశంకర్ సమావేశానికి హాజరయ్యారు. కావాల్సిన కోరం ఉండడంతో అధికారులు అవిశ్వాస బలపరీక్షను నిర్వహించారు. దీంతో వైస్‌చైర్మన్ జహీర్‌రంజానికి వ్యతిరేకంగా 34మంది కౌన్సిలర్లు చేతులెత్తి మద్దతు తెలిపారు. అయితే మున్సిపల్ కార్యాలయ పరిసరప్రాంతాల్లో 144 సెక్షన్‌ను విధించిన పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్పీ గౌస్‌ఆలం, డీఎస్పీ జీవన్‌రెడ్డిలు ప్రత్యేక బలగాలను మోహరించి గట్టిబందోబస్తును ఏర్పాటుచేశారు.

బీఆర్ఎస్‌కు బీజేపీ మద్దతు

మున్సిపల్ వైస్‌చైర్మన్‌పై బీఆర్ఎస్ అవిశ్వాస తీర్మాణాన్ని ప్రవేశపెట్టగా దానికి బీజేపీ మద్దతునిచ్చింది. దీంతో వైస్‌చైర్మన్ జహీర్ రంజాని పదవిని కోల్పోవాల్సి వచ్చింది. బీఆర్ఎస్ పార్టీతో గెలిచిన జహీర్‌రంజాని అసెంబ్లీ ఎన్నికల వరకు బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగారు. బీఆర్ఎస్‌కు అధికారం దూరం కావడంతో ఇటీవలే కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. దీంతో ఆయనను పదవి నుంచి తొలగించేందుకు బీఆర్ఎస్ తీవ్ర ప్రయత్నాలు చేసింది దీనికి బీజేపీ మద్దతు తెలుపడంతో ప్రతిపక్షాలకు విజయం దక్కింది. చివరి వరకు ప్రయత్నాలు చేసిన కాంగ్రెస్‌కు అవసరమైన మెజార్టీ లేకపోవడంతో అవిశ్వాసంపై చేతులేత్తేసింది. కారు, కమలం ఒక్కటి కావడంతో అధికార పార్టీ అడ్డుకట్ట వేయలేకపోయింది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో 'నువ్వా నేనా' అన్నట్లుగా కనిపించిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు మున్సిపల్ అవిశ్వాసంతో ఒక్కటయ్యాయన్న టాక్ వినిపిస్తోంది. మాజీ మంత్రి జోగురామన్న, ఎమ్మెల్యే పాయలశంకర్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో అవిశ్వాసం నెగ్గిందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. గత కొంత కాలం క్రితమే బీఆర్ఎస్ పార్టీ నుంచి వెళ్లిపోయిన ముగ్గురు కౌన్సిలర్లను తిరిగి సొంత గూటికి తీసుకు రావడంలో బీఆర్ఎస్ సక్సెస్ అయిందనే చెప్పవచ్చు. దీంతో బల్దియా రాజకీయం ఒక్కసారిగా మలుపుతిరిగింది. అప్రమత్తంగా లేకపోవడంతోనే అధికార పార్టీ సక్సెస్ కాలేక పోయిందన్న టాక్ విన్పిస్తోంది.

వెళ్లిపోయిన ఎమ్మెల్యే

మున్సిపల్ ప్రత్యేక సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే పాయలశంకర్ 10 నిమిషాల్లోనే తిరిగి వెళ్లిపోయారు. ఎందుకంటే వైస్‌చైర్మన్‌పై అవిశ్వాసం నెగ్గేందుకు 34 మంది కౌన్సిలర్ల మద్దతు అవసరం ఉ ంటుంది. కానీ ఎమ్మెల్యే మద్దతుతో సభ్యుల సంఖ్య బలం 35కు చేరింది. దీంతో తన మద్దతు అవసరం లేకపోవడంతో సమావేశం నుంచి వెనువెంటనే వెళ్లిపోయారు. కానీ సమావేశానికి హాజరైనట్లు అధికారుల రిజిష్టర్‌లో సంతకం చేశారు. ముందు చూపుతో సభ్యత్వాన్ని నమోదుచేసుకున్న ఎమ్మెల్యే ఓటు వేయకుండానే వెళ్లిపోవడం చర్చనీయాంశమైంది. అయితే ఎమ్మెల్యే పాయలశంకర్ వ్యూహాత్మకంగానే వ్యవహరించాడన్న టాక్ వినిపించింది.

పలువురు కౌన్సిలర్లపై వేటు

కాంగ్రెస్ పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా వ్యవహరించారంటూ నలుగురు కౌన్సిలర్లపై ఆరేళ్ల పాటు సస్పెన్షన్ వేటు వేసినట్లు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుడిపెల్లినగేష్ ఒక ప్రకటనలో తెలిపారు. వీరితోపాటు కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్న మరో నలుగురిపై క్రమశిక్ష ణ చర్యలు తీసుకున్నారు. ఇందులో 19వ వార్డు కౌన్సిలర్ మడావి మంగళ, 14వ వార్డు కౌన్సిలర్ బడాల సుజాత, 37వ వార్డు కౌన్సిలర్ అంబకంటి అశోక్, 8వ వార్డు కౌన్సిలర్ రేష్మాముబారక్, 30 వార్డు కౌన్సిలర్ మొగులూరి విజయ్‌లతోపాటు మడావి రామేశ్వర్, బడాల సృజన్‌కుమార్, ముబార క్‌లపై సస్పెన్షన్ వేటు వేస్తూ కాంగ్రెస్ పార్టీ ప్రకటన విడుదల చేసింది. అయితే తమకెలాంటి సమాచారం ఇవ్వకుండానే పార్టీ నుంచి సస్పెన్షన్ చేయడం ఏమిటని కౌన్సిలర్లు ప్రశ్నిస్తున్నారు.

కొత్త వైస్‌చైర్మన్‌పై మొదలైన లొల్లి

అవిశ్వాసం నెగ్గడంతో వైస్‌చైర్మన్ జహీర్‌రంజానిని పదవి నుంచి తొలగిస్తూ అధికారులు ప్రకటించారు. దీంతో కొంత మంది కౌన్సిలర్లు వైస్‌చైర్మన్ పదవిపై కన్నేసినట్లు తెలుస్తోంది. బీజేపీ, బీఆర్ఎస్ ఒకటి కావడంతోనే అవిశ్వాసం నెగ్గింది. దీంతో ఇరు పార్టీలకు చెందిన కౌన్సిలర్లు వైస్‌చైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. ఇందులో దుర్గానగర్ కౌన్సిలర్ రఘుపతి, ప్రవీణ్, కొండ గణేష్, మరో ఇద్దరు బీఆర్ఎస్‌కు చెందిన మైనార్టీకౌన్సిలర్లు వైస్‌చైర్మన్ పదవిపై భారీ ఆశలు పెట్టుకుంటున్నారు. అవిశ్వాసానికి మద్దతునిస్తే వైస్‌చైర్మన్ పదవి ఇస్తామని చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో పలువురు కౌన్సిలర్లు అవిశ్వాసానికి అనుకూలంగానే మద్ద తునిచ్చారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన నేతలు తమదగ్గరి అనుచరులకు వైస్‌చైర్మన్ పదవిని కట్టబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఇరుపార్టీల మధ్య సఖ్యత కుదరడం కష్టంగానే కన్పిస్తోంది. పదవీకాలం పెద్దగా లేకపోవడంతో అంతగా పోటీ ఉండే అవకాశం లేదంటున్నారు. అవిశ్వాసం ముగియడంతో కొత్తగా ఎన్నికయ్యే వైస్‌చైర్మన్‌పై బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల్లో లొల్లి మొదలైనట్లు తెలుస్తోంది.

సమావేశానికి గైర్హాజరైన కౌన్సిలర్లు

1. జహీర్‌రంజాని	(వార్డు నెంబర్ 29)
2. సంద నర్సింగ్	(వార్డు నెంబర్ 2)
3. రేష్మా	(వార్డు నెంబర్ 8)
4. ఫాజియా బేగం	(వార్డు నెంబర్ 35)
5. గంద్రత్ లక్ష్మి	(వార్డు నెంబర్ 36)
6. అశోక్‌కుమార్	(వార్డు నెంబర్ 37)
7. ఎల్చల్‌వార్ అర్చన	(వార్డు నెంబర్ 38)
8. తూర్పుటి సుజాత	(వార్డు నెంబర్ 10)
9. సానావాజ్‌హుర్ రహమాన్	(వార్డు నెంబర్ 11)
10. దర్శనాల లక్ష్మణ్	(వార్డు నెంబర్ 13)
11. నజీర్ అహ్మద్	(వార్డు నెంబర్ 17)
12. ఆవుల వెంకన్న	(వార్డు నెంబర్ 42)
13. కలాల శ్రీనివాస్	(వార్డు నెంబర్ 43)
14. నవాజ్‌బేగం	(వార్డు నెంబర్ 44)
15. బి. సతీష్	(వార్డు నెంబర్ 45)

బీజేపీ, బీఆర్ఎస్ సంబరాలు

మున్సిపల్‌వైస్‌చైర్మన్ జహీర్‌రంజానిపై అవిశ్వాసం నెగ్గడంతో బీఆర్ఎస్, బీజేపీ నేతలు సంబరాలు చేసుకున్నారు. పట్టణంలోని వినాయక్‌చౌక్‌లో ట పాసులు పేల్చి స్వీట్లు పంచుకున్నారు. అధికార పార్టీపై విజయం సాధించామంటూ నినాదాలుచేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలు మున్సిపల్ చైర్మన్ జోగుప్రేమేందర్, మాజీమంత్రి జోగురామన్నలను ఎత్తుకుని డ్యాన్సులుచేశారు. బీజేపీ కార్యకర్తలు కూడా పెద్దఎత్తున నినాదాలు చేస్తూ ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. దీంతో పట్టణంలో ఎన్నికల వాతావరణం కన్పించింది. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పట్టణపోలీసులు ముందస్తుచర్యలను తీసుకున్నారు. వినాయక్‌చౌక్ నుంచి పోస్టాఫీస్ రోడ్డు మార్గాన్ని పూర్తిగా మూసివేసి రాకపోకలను దారిమళ్లించారు.





సంబరాలు చేసుకుంటున్న బీఆర్ఎస్, బీజేపీ శ్రేణులు

సంక్షిప్త సమాచారం

వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే: ఎమ్మెల్యే



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

తాంసి, జూలై18: మళ్లీ వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమేనని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. గురువారం మండలంలోని బండలనాగపూర్ గ్రామంలో 105మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ, షదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీ, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

● నేరడిగొండలో..

నేరడిగొండ: ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ తన నివాసంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీచేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్‌సజన్, సురేందర్, దేవేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

విఠోబా పల్లకీ ఊరేగింపు

ఇంద్రవెల్లి, జూలై18: మండల కేంద్రంలోని విఠోబా ఆలయకమిటీ ఆధ్వర్యంలో గురువారం విఠోబా పల్లకీ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లకీ శోభాయాత్ర ప్రధాన వీధుల గుండా అడుగడుగునా మహిళలు మంగళహారతులతో ఘనస్వాగతం పలుకుతూ దీక్షలు విరమించారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన ఏర్పాటుచేశారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన తప్పనిసరి

నేరడిగొండ,జూలై18: విద్యార్థులకు చట్టాలపై అవగాహన తప్పనిసరిగా ఉండాలని బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ పంద్రంశంకర్ అన్నారు. గురువారం మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ బోథ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ పంద్రంశంకర్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని, చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని విద్యాహక్కు, బాల్యవివాహాలు, మోటార్ వెహికల్ చట్టం, మహిళా, పోక్సో చట్టాలు లోక్ అదాలత్ నేరాల నమోదు ఎఫ్ఐఆర్ చార్జీషీటు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శబానాతారుణం, లెక్చరర్ బలరాం జాదవ్, న్యాయవాది కుమ్మరి విజయ్‌కుమార్, ఎట్టం రాములు, ఏఎస్సై మారుతి, లీగల్ సర్వీసెస్ శ్రవంతి, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా మొదటిరోజు డీఎస్సీ పరీక్ష



అభ్యర్థులను తనిఖీ చేస్తున్న అధికారులు

మావల, జూలై18: జిల్లా కేంద్రంలో నిర్వహించిన డీఎస్సీ మొదటిరోజు ప్రశాంతంగా కొనసాగింది. ఉదయం 9గంటల నుంచి 11.30గంటల వరకు ఎస్ఏ ఫిజిక్స్ పరీక్షకు వంద మందికి 86మంది హాజరయ్యారు. అదేవిధంగా మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరిగిన పీఈటీ పరీక్షకు వంద మందికి 86 హాజరైనట్లు పరీక్ష సూపరింటెండెంట్ పున్నారావు తెలిపారు. తొలిసారి నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షకు నలంద కళాశాలలో అధికారులు నిర్వహించారు.

● ఉదారత చాటిన పోలీసులు

మధ్యాహ్నం డీఎస్సీ పరీక్షరాసే అభ్యర్థులకు పోలీసులు సహకారం అందించారు. పరీక్ష కేంద్రం వద్ద వర్షం పడటంతో విద్యార్థులు లోపలికి వెళ్లేందుకు సమయం వృథా అవుతుందని కాగా మావల ఎస్సై విష్ణువర్ధన్ పోలీసువాహనంలో ఎక్కించుకుని అభ్యర్థులను పరీక్ష కేంద్రానికి చేర్చారు. అంతకుముందు పరీక్ష కేంద్రానికి హాజరయ్యే అభ్యర్థులకు రూరల్ సీఐ ఫణీందర్, మావల ఎస్సై విష్ణువర్ధన్ పోలీసులు సిబ్బంది ప్లకార్డుతో బెస్ట్‌విషెస్ తెలిపారు.

తాంసిలో ఘనంగా మొహర్రం వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

తాంసి, జూలై 18: తాంసిలో మొహర్రం వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో మేళ వాయిద్యాల మధ్య పీరీలను ఊరేగింపు నిర్వహించారు. వేలాదిమంది ఈ వేడుకలను తిలకించేందుకు తరలివచ్చారు. నాగపూర్, కప్పర్ల, పొన్నారి, వడ్డాది గ్రామాల్లో ఈ వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. పున్నారిలో ప్రతిష్ఠించిన పీరీలను ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వెళ్లి పూజలు నిర్వహించారు.

'ఫొటోగ్రాఫర్ల ఎక్స్పోను విజయవంతం చేయండి'

బోథ్, జూలై18: ఈనెల 26న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఫొటోఎక్స్పో ఫొటోగ్రాఫర్ల పండుగను జిల్లాలోని ఫొటోగ్రాఫర్లందరూ విజయవంతం చేయాలని ఫొటోగ్రాఫర్ల సంఘం మండల అధ్యక్షుడు కాడేరుల గణేష్, గౌరవ అధ్యక్షులు జూకంటి సదాశివ్, ఉపాధ్యక్షులు శ్రీరాం, విజయ్‌లు కోరారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎంపీ



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎంపీ

బోథ్, జూలై18: మండలంలోని పొచ్చెర గ్రామంలో రెండురోజుల క్రితం విద్యుత్‌శాఖతో మృతిచెందిన సాయిచరణ్ కుటుంబాన్ని ఆదిలాబాద్ ఎంపీ జి.నగేష్ గురువారం పరామర్శించారు. విద్యుత్ షాక్‌తో మృతి చెందిన సాయిచరణ్ తండ్రి రాజేందర్‌ను పరామర్శించారు. అంతకుముందు మండలకేంద్రంలోని వేదపండితులు శంకర్ పంతులు మృతిచెందగా ఆయన కుమారుడిని కుటుంబీకులను పరామర్శించారు. వారి మృతి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బోథ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌ఎంపీ అనుచరుడు రఫీ అహ్మద్ మృతిచెందడంతో నిర్మల్ ప ట్టణానికి వెళ్లి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట బీజేపీ నాయకులతో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు

● కలెక్టర్ రాజార్షిషా





సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజార్షిషా, పాల్గొన్న అధికారులు

ఆదిలాబాద్ అర్బన్, జూలై 18: ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతురుణమాఫీకి సంబంధించిన గైడ్‌లైన్స్ ప్రకారం జమయ్యే రుణం ఎలాంటి ఇబ్బంది లేకుండా రైతులకు చేరేలా బ్యాంకర్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజార్షిషా అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకర్లతో గూగుల్ మీట్ ద్వారా సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రైతురుణమాఫీ-2024 లక్షలోపు పంట రుణాలు పొందిన 18,739 మంది రైతులకు సంబంధించిన రుణాలు మాఫీ చేయడం జరుగుతుందని తెలిపారు. లక్ష లోపు రుణం తీసుకున్న రైతులు రుణమాఫీ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వారి ఖాతాలో జమైన రుణమాఫీని నేరుగా రైతులకే అందేటట్లు చూడాలని సూచించారు.వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రతి రైతు వేదికలో రైతుల లిస్టు డిస్ప్లే చేయాలన్నారు. రైతులకు సంబంధించిన ఆధార్‌కార్డు, పాస్‌పుస్తకం తదితర డాక్యుమెంట్స్ తీసుకొని రెన్యూవల్ కోసం బ్యాంకుకు రావాల్సి ఉంటుందని తెలిపారు. కాగా ప్రతీ గ్రామ పంచాయతీల్లో రైతులకు సంబంధించి వివరాలతో కూడిన బ్యానర్ల ఏర్పాటు చేయాలని, వ్యవసాయ విస్తరణ అధికారులు అందుబాటులో ఉండి రైతు రుణమాఫీ రైతులకు చేరేలా చూడాలని సూచించారు. రైతులు ఇబ్బందులు పడకుండా క్రాప్‌లోన్ రెన్యూవల్ చేసుకునేందుకు బ్యాంకు అధికారులు సహకరించాలని సూచించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు బ్యాంకు అధికారులకు సహకారం అందించాలని, ఎలాంటి సమస్యలు ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ఇందులో వ్యవసాయ శాఖ అ ధికారి పుల్లయ్య, లీడ్ బ్యాంకు మేనేజర్, ఎ స్‌బీఐ రీజినల్ మేనేజర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తెలంగాణ గ్రామీణ బ్యాంకు, కో ఆపరేటివ్ బ్యాంకు, ఇతర బ్యాంకుల అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

ఆదిలాబాద్ రూరల్, జూలై18: జిల్లాలో త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పర్యటనల నేపథ్యంలో గురువారం కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్ ఆలం, ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా ఏర్పాట్లను పరిశీలించారు. రిమ్స్‌ను సందర్శించి ఆస్పత్రిలో ప్రారంభం కానున్న మహిళాశక్తి క్యాంటీన్, ఎంఆర్ఐ మెషిన్, కమాండ్ కంట్రోల్ తదితర అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. క్యాంటీన్‌ను సీఎం ప్రారంభించనున్నందున ఆ ఏర్పాట్లను పరిశీలిస్తూ డీఆర్డీవో సాయన్నకు ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, దగ్గరుండి అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో వినోద్ కుమార్, ప్రత్యేక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బేసిక్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పుస్తకావిష్కరణ

ఆదిలాబాద్‌రూరల్, జూలై18: జిల్లాకేంద్రంలోని సంజయ్‌గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎలక్ట్రికల్‌అండ్ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్ విభాగాధిపతి కె.వీరస్వామి, అధ్యాపకురాలు బి.జ్యోత్స్నారాణి రచించిన బేసిక్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అనే పుస్తకాన్ని గురువారం ప్రిన్సిపాల్ స్వామి ఆవిష్కరించారు. కార్యక్రమంలో విభాగాల అధిపతులు రాజ్‌కుమార్, మాషయ్య, క్రాంతి కుమార్, సుజయ్, రాజన్న, అధ్యాపకులు మురళీకృష్ణ, కుమారస్వామి, సంగీత, విజయలక్ష్మి, యశశ్రీ, శ్రీనివాస్, రామేశ్వర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని తేలిపోయింది

● కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి

ఆదిలాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ అవిశ్వాసంతో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటేనని తేలిపోయింది. ముందునుంచి జిల్లా ప్రజలు అనుకుంటున్నట్లుగా ఎమ్మెల్యే పాయలశంకర్, మాజీమంత్రి జోగురామన్నల మధ్యరహస్య ఒప్పందం కుదిరిందంటూ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ కందిశ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. గురువారం ప్రజాసేవాభవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం కావడం ఖాయమై పోయిందన్నారు. ఢిల్లీస్థాయిలో చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోందని, లోక్‌సభ ఎన్నికల్లో ఒకరికొకరు సహకరించుకున్న విషయం తెలిసిందేనన్నారు. పట్టపగలే బరితెగించి అవిశ్వాసానికి మద్దతునిచ్చిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల రహస్య ఒప్పందం బయట పడిందన్నారు. ఇచ్చినమాట ప్రకారం కాంగ్రెస్ రూ.2లక్షల రుణమాఫీ చేసిందని, హరీశ్‌రావుకు దమ్ముధైర్యం ఉంటే ఆగస్టు 15లోపు రాజీనామా చేయాలని డిమాండ్‌చేశారు. ఇందులో డీసీసీబీ చైర్మన్ అడ్డిభోజారెడ్డి, గుడిపెల్లినగేష్, ప్రవీణ్‌రెడ్డి, గిమ్మ సంతోష్, దేరకృష్ణారెడ్డి, గంగారెడ్డి, ప్రశాంత్, జహీర్ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కందిశ్రీనివాస్‌రెడ్డి